సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం ׀ 27 ׀ ఆగస్టు ׀ 2023



ప్రజల కష్టం తెలిసిన వ్యక్తి..

ప్రజల కష్టం తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.

వివరాలు 8లో ▸



డీజిల్ అక్రమ దందా!

కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొచ్చిన డీజిల్ ట్యాంకర్ జడ్చర్లలో పట్టుబడింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.9 /22.7

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

చేజిక్కించుకునేదెవరో!

కాంగ్రెస్‌లో ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ

- ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి ఆశావహుల పోటాపోటీ
- ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు 56 అర్జీలు
- అత్యధికంగా మహబూబ్‌నగర్‌లో ఏడుగురు..
- కొడంగల్, అలంపూర్ నుంచి ఒకే ఒక్కటి..



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీ అధిష్టానం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ ప్రక్రియ శుక్రవారంతో ముగియగా.. టీపీసీసీ, ఎన్నికల నిర్వహణ కమిటీలు జల్లెడ పడుతున్నాయి. అధికార బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొనే వారినే బరిలోకి దింపే యోచనతో క్షేత్రస్థాయిలో పక్కాగా వడపోత కార్యక్రమాన్ని చేపట్టాయి. దరఖాస్తుదారుల ఓటు బ్యాంకు, బలాబలాలను ఇదివరకే అంచనా వేసినప్పటికీ.. కాంగ్రెస్ జిల్లా కమిటీలు, ఆయా సెగ్మెంట్లలో కరుడుకట్టిన కాంగ్రెస్ వాదుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అంశాలను పరిశీలించి.. ఒకటి, రెండు రోజుల్లో దరఖాస్తుదారుల జాబితాను సమగ్రంగా సీడబ్ల్యూసీకి పంపించేలా ముఖ్య నేతలు ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి పాలమూరులోని ఆయా సెగ్మెంట్లకు సంబంధించి హస్తం టికెట్ చేజిక్కించుకునేదెవరనే అంశం హాట్‌టాపిక్‌గా మారింది. అంతేకాదు.. భారీగా వచ్చిన దరఖాస్తులపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

అత్యధికంగా బీసీలు..

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ స్థానాలను బీసీ అభ్యర్థులకు కేటాయిస్తామని కాంగ్రెస్ అగ్రనేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల నుంచి బీసీ వర్గాలకు చెందిన నేతలు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. అచ్చంపేట, అలంపూర్, కొడంగల్, నారాయణపేట మినహాయించి మిగిలిన వాటిలో నియోజకవర్గానికి కనీసం ఒకటి నుంచి నాలుగు వరకు దరఖాస్తులు బీసీ అభ్యర్థుల నుంచి వచ్చినట్లు తెలుస్తోంది.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తు చేసుకుంది వీరే..

మహబూబ్‌నగర్ (7): ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్ ముదిరాజ్, రాఘవేంద్రరాజు, ఖలీద్ సైఫుల్లా, బెక్కరి అనిత, ఎన్పీ వెంకటేష్, ఎస్.వినోద్ కుమార్

జడ్చర్ల (5): జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎర్ర శేఖర్, మధు, రాజశేఖర్‌రెడ్డి, బంగ్లా రవి

దేవరకద్ర (4): జి.మధుసూదన్‌రెడ్డి, కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్, కొండా ప్రశాంత్ రెడ్డి, కొత్త అరవింద్‌కుమార్ రెడ్డి

కొడంగల్ (1): రేవంత్ రెడ్డి

షాద్‌నగర్(4): వీర్లపల్లి శంకర్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, అలుగడ్డ ప్రవీణ్ యాదవ్, టంగు శ్రీనివాస్ యాదవ్

నారాయణపేట (3): హర్షవర్ధన్ రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి, సుజేందర్ శెట్టి

మక్తల్ (6): వాకిటి శ్రీహరి, నాగరాజు గౌడ్, ప్రశాంత్ కుమార్ రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, సుగప్ప ముదిరాజ్, విష్ణువర్ధన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ (3): నాగం జనార్దన్ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కొణిదెల రాము

అచ్చంపేట (2): చిక్కుడు వంశీకృష్ణ, చిక్కుడు అనురాధ

కల్వకుర్తి (5): వంశీచందర్ రెడ్డి, కేవీఎన్ రెడ్డి, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రవికాంత్ గౌడ్

కొల్లాపూర్ (5): జూపల్లి కృష్ణారావు, చింతల జగదీశ్వర్ రావు, కాటమోని తిరుపతమ్మ గౌడ్, రాము యాదవ్, కేతూరి వెంకటేష్

అలంపూర్ (1): సంపత్‌కుమార్

గద్వాల (6): సరితా తిరుపతయ్య, పటేల్ ప్రభాకర్ రెడ్డి, వీరబాబు, రాజీవ్ రెడ్డి, బలిగెర నారాయణ రెడ్డి, కుర్వ విజయ్‌కుమార్

వనపర్తి (4): చిన్నారెడ్డి, మేఘారెడ్డి, శివసేనారెడ్డి, మొగిలి సత్యారెడ్డి

14 అసెంబ్లీ స్థానాలు.. 56 మంది పోటీ

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న 56 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 2 నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని స్థానాల్లో ఇద్దరు , అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులు అత్యధికంగా మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. మక్తల్, గద్వాల నుంచి ఆరుగురు, కల్వకుర్తి, కొల్లాపూర్, జడ్చర్ల నుంచి ఐదుగురు, దేవరకద్ర, వనపర్తి, షాద్‌నగర్ నుంచి నలుగురు, నాగర్‌కర్నూల్, నారాయణపేట నుంచి ముగ్గురు చొప్పున అర్జీలు పెట్టుకున్నారు. అచ్చంపేట నుంచి డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణతో పాటు ఆయన భార్య డాక్టర్ అనురాధ దరఖాస్తు చేసుకోగా.. అలంపూర్, కొడంగల్ శాసనసభ స్థానానికి అత్యల్పంగా ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

కాంగ్రెస్‌కు బిగ్ షాక్

- పార్టీకి గుడ్‌బై చెప్పిన అభిలాష్‌రావు



చిన్నంబావి: కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు బిగ్ షాక్ తగిలింది. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండేళ్ల క్రితమే కాంగ్రెస్‌లో చేరిన ఆయన వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అయితే కొన్ని రోజులుగా స్థానికంగా వర్గ పోరుతో ఇబ్బందులకు గురిచేస్తూ.. తనను రాజకీయంగా లేకుండా చేయాలనే ఉద్దేశంతో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యవహరిస్తున్నట్లు మనస్తాపానికి గురయ్యారు. ఈ మేరకు రాజీనామా చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సమాచారం అందించారు. అయితే రంగినేని సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరనున్నట్లు సమాచారం.

అరకొరగానే..

- డీఎస్సీలో 586 పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 2వేలకు పైనే ఖాళీలు
- వనపర్తి, పాలమూరు నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి
- పోస్టులు పెంచాలని అభ్యర్థుల వేడుకోలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్నో ఏళ్లుగా నిరుద్యోగ అభ్యర్థులు ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రభుత్వం త్వరలో చేపట్టనుంది. అయితే అవి అత్తెసరుగానే కేటాయించడంతో సదరు అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతుంది. ప్రభుత్వం పోస్టులు వేస్తుందన్న ఆశతో కొన్ని నెలలుగా ప్రిపరేషన్ సైతం ముమ్మరం చేశారు. అందులో భాగంగా డీఎస్సీ నిర్వహించే కంటే ముందే టెట్ నిర్వహించాలని భావించిన ప్రభుత్వం గత నెల చివరలో టెట్ దరఖాస్తులు సైతం స్వీకరించింది. వచ్చేనెల 15న ఉదయం, మధ్యాహ్నం టెట్ రెండు సెషన్స్‌లో నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిలో కేవలం 586 పోస్టులను మాత్రమే ప్రభుత్వం భర్తీ చేస్తుందని ప్రకటించడంతో నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. టెట్‌లో రెండు పేపర్లు కలిసి దాదాపు 80 వేల వరకు దరఖాస్తులు చేసుకుంటే అందులో తక్కువ పోస్టులు భర్తీ చేయడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోస్టులు తక్కువగా ఉన్న నేపథ్యంలో చాలామంది టెట్ పరీక్ష రాసినా ప్రయోజనం ఉండదని, పోస్టులు పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఖాళీలు..

ఉమ్మడి జిల్లాలో 2 వేల వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నారాయణపేట జిల్లాలో అత్యధికంగా 470 పోస్టులు, మహబూబ్‌నగర్‌లో 415, నాగర్‌కర్నూల్‌లో 450, గద్వాల, వనపర్తిలో 316 పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయి. వీటిలో 30 శాతం పోస్టులు పదోన్నతుల కోసం వదిలేసినా దాదాపు 1,400 పోస్టులు నేరుగా భర్తీ చేయాల్సి ఉంటుంది. కానీ, ప్రభుత్వమే పోస్టులను తక్కువ భర్తీ చేస్తుందని పలువురు అభ్యర్థులు పేర్కొంటున్నారు.

పోస్టులు పెంచాలి..



తెలంగాణ వచ్చాక మొదటి డీఎస్సీ ఆరేళ్ల తర్వాత ఇప్పుడు వేశారు. ఉద్యోగం కోసం డైట్, బీఈడీలను సంవత్సరాల తరబడి చదివాం. 5 వేల పోస్టులు ఏ మూలకు సరిపోతాయి. ఉమ్మడి జిల్లాలో ఒక్క పోస్టు కోసం 200 వరకు పోటీ ఉంది. ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీచేసేలా చర్యలు తీసుకోవాలి.

– నవీన్‌కుమార్, మహబూబ్‌నగర్

ఎదురుచూపులకు ఇదేనా ఫలం



2017 తర్వాత ప్రభుత్వం డీఎస్సీ ప్రకటిస్తుందని ఎదురుచూస్తున్నాం. ఇందుకు 5 వేల పోస్టులేనా ఫలం. మేం బీఈడీ చదివినందుకు వేరే పోస్టులకూ సిద్ధం కావడం లేదు. డీఎస్సీనే నమ్ముకున్నాం. మహబూబ్‌నగర్ జిల్లాకు చాలా తక్కువ పోస్టులున్నాయి. అసెంబ్లీలో ప్రకటించిన విధంగా పోస్టులు పెంచాలి.

– శివ, మహబూబ్‌నగర్

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం టెట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని ఉపాధ్యాయ ఖాళీల నివేదికలను గతంలోనే ఉన్నతాధికారులకు అందించాం. అభ్యర్థులు సమయం వృథా చేసుకోకుండా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.

– గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్



మహబూబ్‌నగర్‌లోని రాంనగర్ లైబ్రరీలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు (ఫైల్)

పదోన్నతులు తగ్గించినా తక్కువే..

ప్రభుత్వం భర్తీ చేయాల్సిన మొత్తం పోస్టులలో 30 శాతం పదోన్నతులు, 70 శాతం నేరుగా నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి. స్కూల్ అసిస్టెంట్లు, గెజిటెడ్ హెచ్‌ఎంలు, ఎస్జీటీ (సెకండ్ గ్రేడ్ టీచర్)లు, భాషా పండితులు గ్రేడ్ 2 నుంచి గ్రేడ్ 1, పీఈటీలకు పీడీలు (ఫిజికల్ డైరెక్టర్) పదోన్నతులు కల్పిస్తుంది. వీటికి రేషియో ప్రకారం 30:70:30 పదోన్నతులు ఇవ్వాలి. కానీ, పదోన్నతుల పోస్టులను తగ్గించినప్పటికీ కూడా భారీగానే పోస్టులు పెరిగే అవకాశం ఉంది.

జిల్లా	భర్తీ చేయనున్న పోస్టులు	దరఖాస్తు చేసుకున్నవారు	
		టెట్- 1	టెట్- 2
మహబూబ్‌నగర్	96	18,566	13,581
జోగులాంబ గద్వాల	146	8,052	5,203
నాగర్‌కర్నూల్	114	8,539	6,468
నారాయణపేట	154	4,655	3,001
వనపర్తి	76	7,186	5,547

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



పాలకొండ ఊరగట్టు చెరువులో చేపపిల్లలు వదులుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

- బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కులవృత్తులకు పూర్వవైభవం
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వం వందశాతం సబ్సిడీపై అందజేస్తున్న 8వ విడత చేప విత్తనాలను శనివారం మహబూబ్‌నగర్ పట్టణం పాలకొండ ఊరగుట్ట చెరువులో వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకొచ్చినట్లు చెప్పారు. గ్రామాలకు తలమానికంగా ఉన్న చెరువులను మిషన్ కాకతీయ పథకం ద్వారా పునరుద్ధరించి పటిష్టపరచడం జరిగిందన్నారు. చెరువుల్లో పూడిక తీసి నీరు ఎక్కువగా నిలిచేలా చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు చెరువులపై ఆధారపడి వృత్తిని నమ్ముకొని జీవించే మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా చేయమని వివరించారు. జిల్లాలోని చెరువులు, కుంటల్లో ఈ సంవత్సరం కోటి 96 లక్షల చేప విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల సంక్షేమంతో పాటు అన్ని కులాల కులవృత్తులను కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. తెలంగాణ రాకముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కులవృత్తులు ధ్వంసమయ్యాయని, పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. అన్ని కులాలను అభివృద్ధి చేసి వృత్తులను కాపాడుకునేందుకు పూర్వవైభవం లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, జిల్లా మత్స్య సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, మత్స్యశాఖ ఏడీ రాధారోహిణి, కౌన్సిలర్ నరేందర్, నాయకులు దోమ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరిస్తాం: ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్‌ఎంకు వచ్చిన ప్రయాణికుల ఫిర్యాదులు, సూచనలను పరిశీలించి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌ఎం కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహించి ప్రయాణికుల నుంచి ఆర్టీసీకి సంబంధించిన ఫిర్యాదులు తీసుకున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో సిటీ బస్సులు నడపాలని, నవాబ్‌పేట-కొత్తపల్లి నైట్‌హాల్ట్ బస్సును, మహబూబ్‌నగర్-లింగంపల్లి-చౌడాపూర్ బస్సును పునరుద్ధరించాలని, సాయంత్రం వేళలో షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు బస్సు నడపాలని, నవాబ్‌పేట బస్టాండ్‌లో బస్సుల సమయ సూచిక ఏర్పాటు చేయాలని ప్రయాణికులు తమ ఫిర్యాదులను ఫోన్ ద్వారా తెలియజేశారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలి



మహబూబ్‌నగర్ క్రైం: రాబోయే ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, ఇతర సిబ్బంది ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే గ్రామాల్లో ముందస్తు భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజనీకుమార్ అన్నారు. హైదరాబాద్ నుంచి శనివారం ఎస్పీలతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో నేరస్తులు, రౌడీలు, ఇతర అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పరిధిలో శాంతిభద్రతలకు ప్రత్యేకంగా కృషి చేస్తామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకొని ప్రజలతో మమేకం అవుతున్నట్లు తెలిపారు. గత ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం కోర్టు అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఏఎస్పీ రాములు, డీఎస్పీలు టి.మహేష్, రమణారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటును నమోదు చేసుకోవాలి

- పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు
- జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు: కలెక్టర్



ఏనుగొండలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ రూరల్: కొత్తగా ఓటరు నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఓటరు జాబితాను సరిచూసుకోవడం వంటివి చేపట్టేందుకు ఈ నెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలుగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రవినాయక్ తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ఎవరైనా చిరునామా మార్పు, పేర్లలో తప్పు ఉన్నట్లయితే సరి చేసుకోవాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రత్యేక ప్రచార రోజులలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్‌లోని ఏనుగొండ, అప్పన్నపల్లి, జడ్చర్లలో ఇందిరానగర్, కావేరమ్మపేట, భూత్పూర్, అమిస్తాపూర్ పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటరు జాబితాతో పాటు అన్ని ఫారాలతో తమ పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్లు ఓటరు జాబితాలో వారి పేర్లు ఉన్నది, లేనిది చూసుకోవాలని, అలాగే పేర్లలో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ఇదే మంచి అవకాశమన్నారు. చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించేందుకు బీఎల్‌ఓలు తప్పనిసరిగా మరణ ధ్రువీకరణ పత్రాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని, ఇందుకోసం మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని చెప్పారు. ఓటరు జాబితాలో మార్పు, చేర్పులను చేపట్టడం నిరంతరం జరిగే ప్రక్రియ అయినప్పటికీ ఈ ప్రత్యేక ప్రచార రోజులలో అన్ని రకాల ఫారాలను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, భూత్పూర్ మండలాల తహసీల్దార్లు నాగార్జున, శ్రీనివాసులు, భానుకిరణ్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, తదితరులు ఉన్నారు.

వందశాతం లక్ష్యం పూర్తి

పాలమూరు: జిల్లావ్యాప్తంగా ఒకే రోజు 4.22లక్షల మొక్కలు నాటినట్లు రవినాయక్ తెలిపారు. స్వాతంత్య్ర భారత వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి మొక్కల నాటే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 4.20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా ఉండగా.. అంతకు మించి నాటినట్లు చెప్పారు. జిల్లాలో ఒక్కో గ్రామ పంచాయతీకి 740 మొక్కలు, మూడు మున్సిపాలిటీలకు 1,18,239 మొక్కలు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా లక్ష్యాన్ని పూర్తి చేశామని, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో 56068, జడ్చర్లలో 37053, భూత్పూర్ పరిధిలో 25,118 మొక్కలు నాటారు. డీఆర్‌డీఓ పరిధిలో 3,03,753 మొక్కలు నాటారు. కేసీఆర్ అర్బన్‌పార్క్‌లో కలెక్టర్‌తో పాటు, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, డీఆర్‌డీఓ యాదయ్య, తదితరులు మొక్కలు నాటారు.



పీయూలో మెడిటేషన్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మెడిటేషన్‌పై ఎన్‌రోల్ ఆఫ్ మెడిటేషన్ ఇన్‌ది ఎన్రిచ్‌మెంట్ అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఊయ్యూరు శోభారాణి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు మెడిటేషన్ వల్ల జ్ఞాపకశక్తిని పెంచుకోవచ్చని, ఏకాగ్రత వల్ల జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

పాలమూరు: జిల్లాలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ప్రీ లిటిగేషన్ కేసులలో 300 కక్షిదారులకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి వెల్లడించారు. జిల్లా కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, రోడ్డు ప్రమాద, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. ప్రధానంగా రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులలో ఇరు పక్షాలను పిలిచి రాజీ చేయడం జరుగుతుందన్నారు. దీంతో తక్కువ సమయంలో కేసు పరిష్కారం అవుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి కక్షిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు పలు బ్యాంకులలో ఉన్న లిటిగేషన్ కేసులలో నోటీసులు ఇచ్చామన్నారు.

■ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా అధికార సంస్థ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి ప్రారంభించారు. కోర్టు సిబ్బందితో పాటు న్యాయవాదులు రక్తదానం చేశారు. న్యాయమూర్తులు చంద్రకళ, వై.పద్మ, ఎం.కె పద్మావతి, సంధ్యారాణి, చిరంజీ ఆశలత, హరికుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యాదాఘాతంతో యువకుడి మృతి

కొల్లాపూర్: విద్యాదాఘాతంతో యువకుడి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద బోయ శ్రీను(36) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అమరచింత: కుటుంబంలో తరచూ జరుగుతున్న చిన్నచిన్న తగాదాలు, గొడవలకు కళత చెందిన మదుగణి చిన్నరవి(35) శనివారం ఇంట్లో కిటికీకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అమరచింతలో చోటుచేసుకుంది. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో నివాసముంటున్న చిన్నరవి, మాదవిలు భార్యాభర్తలు. వీరికి పదో తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. కొన్ని రోజులుగా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న భార్యాభర్తలు తరుచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే శనివారం భార్య మాధవితో గొడవ పడిన రవి, ఇంట్లో కిటికీ కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉరేసుకుని మరొకరు..

మరికల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకుని మృతిచెందిన సంఘటన శనివారం జిన్నారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మరికల్ మండలం జిన్నారానికి చెందిన ఎంకె.వెంకటేష్(48) వృతిరీత్యా కూలీ పనులు చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. చేసిన కూలీ పనుల డబ్బులతో నిత్యం మద్యం తాగేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఉదయం నిద్రలేచి చూడగానే గుడిసెలో ఉరేసుకుని కన్పించాడు. ఈ విషయంపై తల్లి వెంకటమ్మ తన కుమారుడు మద్యం మత్తులో ఉరేసుకుని మృతిచెందాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి


కావలి రాజు(ఫైల్)

పెబ్బేరు రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం శ్రీరంగాపురం మండలం తాటిపాములలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెబ్బేరు మండలం కంచిరావుపల్లికి చెందిన కావలి రాజు(40)ఎలక్ట్రిషన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం తాటిపాములలో హనుమంతురెడ్డి వ్యవసాయ పొలం దగ్గర విద్యుత్ మోటరు రిపేరు చేయడానికి వెళ్లాడు. విద్యుత్ స్తంభంపై తీగల కనెక్షన్ చూస్తుండగా చేతులు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్తంభంపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: మురికి కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వనివారం వనపర్తి పట్టణంలోని రామథియోటర్ వద్ద చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఆవుల ముష్టి గోపాల్(38) కూలిపనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతను శుక్రవారం రాత్రి రామ థియోటర్ వద్ద ఉన్నట్లు మేనమామకు సమాచారం తెలిసింది. అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. గోపాల్‌కు అప్పుడప్పుడు మూర్చవచ్చేదని తెలిపారు. మూత్ర విసర్జనకు వెళ్లి మూర్చ రావడంతో మురికి కాల్వలో పడి మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. అతని మేన మామ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిండు ప్రాణాన్ని కాపాడిన రైల్వే సిబ్బంది

ఎర్రవల్లిచౌరస్తా: ఆత్మహత్యకు పాల్పడుతున్న ఓ నిండు యువకుడి ప్రాణాన్ని రైల్వే సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి కాపాడిన సంఘటన ఇటిక్యాల మండల పరిధిలోని వల్లూరు హాల్టు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి మండలంలోని కొంకలకి చెందిన ఓ యువకుడు కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపంలో ఆత్మహత్య చేసుకునేందుకు ఇటిక్యాల మండల పరిధిలోని వల్లూరు హాల్టు సమీపంలో రైల్వే పట్టాలపై పడుకొని షోషల్ మీడియా ద్వారా మిత్రులకు సమాచారం అందించాడు. షోషల్ మీడియా ద్వారా సమాచారం అందుకున్న గద్వాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ మానవపాడు స్టేషన్‌మాస్టర్ సహకారంతో గుంటూరు రైలు సమాచారం అందుకుని లోకో పైలెట్‌కు వాకీ టాకీ ద్వారా సమాచారం అందించారు. రైలు పట్టాలపై పడుకుని ఉండటాన్ని గమనించి రైలు అతడి వద్దకు రాగానే నిలిపివేసి సదరు వ్యక్తిని పట్టుకున్నారు. అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రజల కష్టం తెలిసిన సీఎం కేసీఆర్


రాయలగండి వద్ద కల్యాణ మండపం పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తదితరులు

- సంక్షేమ, అభివృద్ధి పథకాలతో దేశానికే ఆదర్శం
- రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

అచ్చంపేట/ అమ్రాబాద్: ప్రజల కష్టం తెలిసిన ఒకే ఒక్క వ్యక్తి సీఎం కేసీఆర్ అని.. తన తొమ్మిదేళ్ల పాలనలో పేదల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం ఆయన అచ్చంపేట, అమ్రాబాద్, మన్ననూర్‌లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ముందుగా అమ్రాబాద్‌తోపాటు కుమ్మరోనిపల్లి, రాయలగండి చెన్నకేశవాలయం వద్ద చేపట్టనున్న వివిధ అభివృద్ధి పథకాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే అచ్చంపేటలో ఈద్గా చుట్టూ ప్రహరీ, లింగాల రోడ్డులోని హూసన్న మందిర్ షెడ్డు నిర్మాణం, దర్శన్‌గడ్డ సీమీపంలో ఖబ్రస్థాన్ ప్రహరీ, శ్రీశైలం రోడ్డులో ముస్లిం మైనార్టీల ఫంక్షన్ హాల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అమ్రాబాద్‌లో ఆయన మాట్లాడుతూ 65 ఏళ్ల పాలించిన ప్రభుత్వాలు ప్రజల కష్టాలు తీర్చడంలో నిర్లక్ష్యం చేశాయన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయం వస్తుంది కాబట్టి ఎట్లాగైనా అధికారంలోకి రావాలనే తాపత్రయంతో ఏవేవో హామీలతో కొన్ని పార్టీలు వస్తున్నాయని.. వారిని నమ్మవద్దన్నారు. దేశంలో ఎక్కడా లేనటువంటి పథకాలు ఇక్కడ అమలవుతుంటే మాయమాటలు చెప్పే వారిని ప్రజలు నమ్మరని.. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ అధికారం చేపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గువ్వల మాట్లాడుతూ అప్పర్‌ప్లాట్‌కు సాగునీరు అందించి తీరుతానని స్పష్టం చేశారు. అనునిత్యం కులమతాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలు, ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మార్కెట్ చైర్మన్ అరుణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు మనోహర్, లోక్యానాయక్, రాజేశ్వర్‌రెడ్డి, అమీనొద్దీన్, ఖలీల్, ఎంపీడీఓ రామ్మోహన్, అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి, ఏపీడీ శ్రీనివాసులు, అమ్రాబాద్ సర్పంచ్ శారద, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, చెన్నకేశవులు, రాజారాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించేలా రాష్ట్రాభివృద్ధి

తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి మరోసారి ఈ ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు అన్నివర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఎస్సీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు దేశంలోనే తెలంగాణ ఖ్యాతి పెంచి గౌరవం తెచ్చాయన్నారు. రూ.3 వేల పింఛన్‌ను రూ.4,116 చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో సైతం ఇస్తున్న పింఛన్ రూ.950 మాత్రమే అని విమర్శించారు. మత, కుల పిచ్చోళ్ల చేతిలో దేశం నాశనమైందని, ఫలితంగా వికలాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ గెలుపును ఆపలేరన్నారు.

నిర్వాసితులకు పరిహారం మంజూరు

మక్తల్/ మాగనూర్: సంగంబండ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన గార్లపల్లివాసులకు పరిహారం మంజూరైంది. ఊట్కూర్ మండలం గార్లపల్లి ముంపునకు గురైన ఏళ్లతరబడిగా పరిహారం మంజూరు కావడం లేదని, ఆర్ అండ్‌ఆర్‌లో సరైన వసతులు కల్పించలేదనే విషయాలపై గతనెలలో 'సాక్షి'లో 'గార్లపల్లిపై సంగం బండ'', 'మా బాధలు పట్టవా' శీర్షికన వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి స్పందించి ఇరిగేషన్ కమిషనర్‌తో మాట్లాడి పరిహారం మంజూరుకు చొరవ చూపి మంజూరు పత్రాలు శనివారం పంపిణీ చేశారు. అలాగే మాగనూర్ మండలం ఉజ్జెల్లికి రూ.13,34,59,200, మక్తల్ మండలం సంగంబండకు రూ.11.98 కోట్లు, ఊట్కూరు మండలం గార్లపల్లికి రూ.1.19 కోట్ల నిధులు ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసితులకు మంజూరు చేసింది. 13 ఏళ్లుగా తీరని సమస్య 'సాక్షి' వరుస కథనాలతో నెరవేరాయని నిర్వాసితులు ఆనందం వ్యక్తం చేశారు. పునరావాస బాధితులు ఏళ్ల తరబడి నెలకొన్న రేషన్ దుకాణం ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

సాక్షి ఎఫెక్ట్..





'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలు

ఎమ్మెల్యేపై ప్రజల్లో వ్యతిరేకత

- టికెట్ కేటాయింపుపై అధిష్టానం పునరాలోచించాలి
- మరోసారి సర్వే చేయించి గెలిచే వారికే అవకాశం ఇవ్వాలి
- నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్


మాడ్గులలో మాట్లాడుతున్న బాలాజీసింగ్

ఆమనగల్: కల్వకుర్తి బీఆర్‌ఎస్ టికెట్ ప్రస్తుత ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఇవ్వడంపై అధిష్టానం పునరాలోచించాలని నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్ అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు, ఉద్యమకారులను ఎమ్మెల్యే ఏనాడూ గుర్తించలేదని ఆరోపించారు. తాను పదహారేళ్లుగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నానని చెప్పారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన అభయం మేరకు విదేశాల నుంచి వచ్చి.. పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశానని తెలిపారు. ఏనాడూ పార్టీ ఆదేశాలను ధిక్కరించలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల్లో ఎమ్మెల్యేపై తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. బీఆర్‌ఎస్‌లో అంకిత భావంతో పనిచేసిన నాయకులు, ఉద్యమకారులను ఆయన ఏనాడూ పట్టించుకోలేదని, నామినేటెడ్ పదవులను తన అనుచరులకే కట్టబెట్టాడని ఆరోపించారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతుండగా.. కల్వకుర్తి మాత్రం ఇందుకు నోచుకోలేదని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారుల అభిప్రాయాలను తెలుసుకోకుండానే అధిష్టానం మరోసారి ఆయనకు టికెట్ ఇవ్వడంపై ఆందోళన వ్యక్తంచేశారు. మరోసారి సర్వే చేయించి.. విజయం సాధించేవారికే పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పర్యటించి ప్రజల, కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుంటున్నానని చెప్పారు. అందరి అభిప్రాయం మేరకు అధిష్టానం పునరాలోచన చేయకపోతే.. భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పగడాల రవితేజ, మాజీ సర్పంచ్ సూదిని కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మిద్దె రాములు, సాయిరెడ్డి, మసున విష్ణు, పల్లె జంగయ్య, తిరుపతయ్య, శ్రీనివాస్‌గౌడ్, కంచర్లగిరి, చంద్రయ్య, కోటయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీలో 'తురుంఖాన్లు' సినిమా సందడి


జేపీఎన్‌సీఈ కళాశాలలో తురుంఖాన్లు సినిమా బృందం సభ్యులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నూతనంగా విడుదల కానున్న 'తురుంఖాన్లు' సినియా బృందం మండల పరిధిలోని జేపీఎన్‌సీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడారు. తురుంఖాన్లు సినిమా ప్రతిఒక్కరిని అలరించేలా ఉంటుందని, సినిమాలు జిల్లాకు చెందిన వ్యక్తులు తెరమీద కనిపిస్తున్నారని, జిల్లా స్థాయిని పెంచేలా వారిని ఆశీర్వదించేందుకు పెద్దసంఖ్యలో యువత ఈ సినిమాను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. సినిమా బృందం సభ్యులు పలువురు మాట్లాడారు. సినిమాలోని ప్రతి అంశం అన్ని వర్గాల వారిని అలరించేలా సెంటిమెంట్ ఉంటుందని, సినిమా కోసం చాలా కాలంగా కష్టపడ్డామని దాన్ని ఆదరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నటులు వెంకీ, హీరోలు దేవరాజు, శ్రీరామ్, అవినాష్, హీరోయిన్లు ఐశ్వర్య, సీత, హరిత, చరణ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం

కందనూలు: పురుగుమందు తాగి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శ్రీపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. గ్రామంలో నివసిస్తున్న భీమమ్మ తన కుమార్తె బంగారమ్మ (20)తో కలిసి 10 నెలల క్రితం మండలంలోని వనపట్లకు చెందిన ఓ గుంపు మేస్త్రీ వద్ద పని చేసేందుకు మహారాష్ట్రాకు వెళ్లింది. అప్పటి నుంచి బంగారమ్మ గుంపు మేస్త్రీ కుమారుడు శ్రీశైలంతో చనువుగా ఉంటుంది. వారం క్రితం తల్లీ కుమార్తె ఇద్దరూ తిరిగి గ్రామానికి వచ్చారు. కుటుంబ సభ్యులు యువతికి వివాహం చేసేందుకు సంబంధం తీసుకురావడంతో పాటు పెళ్లి చేసుకోవాలని ఒప్పించడానికి ప్రయత్నాలు చేశారు. ఇది ఇష్టం లేని బంగారమ్మ శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత ఇంట్లోనే పురుగుమందు తాగింది. అర్ధరాత్రి సమయంలో గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లి భీమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జూరాలకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల ఎడమ కాల్వ నుంచి రామన్‌పాడుకు వస్తున్న వరద నీరు

ధరూరు/ దోమలపెంట/ మదనాపురం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం సాయంత్రం 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడు ఎత్తిపోతలకు ఒక పంపు ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 738, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు వదలగా మరో 111 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.933 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిలకడగా కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉంది. శనివారం సాయంత్రం వరకు 27.6 అడుగులకు చేరింది. జూరాల నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా ఒక మోటర్ రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి కుడి ఎడమ కాలువ ద్వారా పంటలకు నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు వచ్చే నీటితో సమానంగా కాలువల ద్వారా నీటిని విడుదల చేయడంతో నీటిమట్టం నిదానంగా పెరుగుతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు కాగా, మరో 5అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు గేట్లను తెరిచే అవకాశం ఉంది.

నిండుకుండలా రామన్‌పాడు

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,030, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల ద్వారా 65, రాజీవ్ భీమా-2కు 849 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

శ్రీశైలంలో 855.6 అడుగులు..

శ్రీశైలం జలాశయంలో శనివారం 855.6 అడుగుల వద్ద 93.3620 టిఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవదిలో పోతిరెడ్డి పాడు ద్వార 6,000, ముచ్చుమర్రి నుంచి కెసి కెనాల్‌కు 490, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు 1,688, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజికెఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 4.535 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 8,763 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు.

మూసి ఉన్న ఇంట్లో చోరీ

- 10 తులాల బంగారం అపహరణ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు


ధరూరులో ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ధరూరు: మండల కేంద్రంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. దుండగులు మూసి ఉన్న ఇంట్లో చొరబడి ఇంట్లోని 10 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ధరూరుకు చెందిన టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్ గతేడాది కొత్త ఇల్లు కట్టారు. ఇల్లు కట్టే క్రమంలో గద్వాలలో ఉండేవారు. అయితే సదరు నాయకులు గద్వాలలో కొన్ని రోజులు, ధరూరులో కొన్ని రోజులు ఉంటూ వస్తున్నారు. వారం రోజుల పాటు కుటుంబమంతా ఇక్కడే ఉండి ఈ నెల 20 గద్వాలకు వెళ్లిపోయారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఎవరూ లేని ఇంట్లో చొరబడ్డారు. బీరువాలోని 10 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. శనివారం సాయంత్రం 3 గంటల సమయంలో ఇంటి తలుపు తెరిచి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. వెంటనే ధరూరు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసలు సంఘటనా స్థలాన్ని పరి శీలించారు. ప్రత్యేక క్లూస్ టీం సాయంతో తనిఖీలు చేశారు. డీఆర్ శ్రీహర్ష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

ప్రభుత్వ వైఖరిపై ఉపాధ్యాయుల అసంతృప్తి


మాట్లాడుతున్న జంగయ్య

గద్వాల: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఖరిపై ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారని ఉపాధ్యాయుల సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) రాష్ట్ర నాయకుడు, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించి శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 12 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, ఐదు సంవత్సరాలుగా బదిలీలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశా. రెండో పీఆర్సీ కమిషన్‌ని వెంటనే ప్రకటించి ఉద్యోగులు నష్టపోకుండా ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జీవో 317తో ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో బీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, యూఎస్‌పీసీ జిల్లా నాయకులు తిప్పన్న, గోపాల్, హరిబాబు, చక్రధర్, రమేష్, ఉదయ్‌కిరణ్, ప్రకాష్, మద్దిలేటి, రమణ, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మల్దకల్: పిడుగుపడి ఓ మహిళ మృతిచెందగా.. మరో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని అమరవాయిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అమరవాయికి చెందిన డీలర్ తిమ్మప్ప తన పొలంలో శనివారం సీడ్ పత్తి క్రాసింగ్ కోసం పలువురు కూలీలు వచ్చారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయంలో ఉరుములతో కూడిన వర్షం కురవడంతో కూలీలు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిగుడు పడటంతో పావని(39) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా బీసన్న, తిమ్మక్కలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే తోటి కూలీలు బాధితులను గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నాయకులు ఆస్పత్రికి చేరుకుని పావని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పావనికి భర్త కృష్ణయ్యతోపాటు నలుగురు సంతానం ఉన్నారు. పావనిమృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రేపు గద్దర్ సంస్మరణ సభ

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో ఈనెల 28న ఉదయం 10గంటలకు ప్రజా యుద్ధనౌక, గాయకుడు గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాన్, బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య మాట్లాడారు. గద్దర్ సంస్మరణ సభకు ప్రముఖ సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి హాజరు కానున్నరని, విద్యార్థులు, రైతులు, మేధావులు, రాజకీయ పార్టీలు, కుల సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా...

యూఏఈలో ఉచిత నియామకాలు

- ఏడీఎస్‌హెచ్ కంపాస్ కంపెనీ వీసాలు
- ముంబైలో ఇంటర్వ్యూలకు ఉచిత బస్సు సౌకర్యం

మోర్తాడ్ (బాల్కొండ): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ప్రముఖ క్యాటరింగ్ సపోర్ట్ సర్వీసెస్ సంస్థగా పేరొందిన ఏడీఎస్‌హెచ్ కంపాస్ సంస్థ ఉచిత నియామకాల ప్రక్రియను చేపట్టింది. తెలంగాణలోని జీటీఎం ఇంటర్నేషనల్ రిక్రూటింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ముంబైలో ఈనెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో ఇంటర్వ్యూలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ముంబైలో రెండ్రోజులు జరిగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులను ఇక్కడి నుంచి తీసుకెళ్లి.. మళ్లీ ఇంటికి పంపించడానికి ఉచిత బస్సు సౌకర్యం కూడా జీటీఎం సంస్థ కల్పించింది. ఈసీఎన్‌ఆర్ పాస్‌పోర్టు కలిగిన 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు ఇంటర్వ్యూలకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నారు. అభ్యర్థులు కాస్త ఆంగ్ల పరిజ్ఞానం కలిగి ఉండాలని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వివరాలను జీటీఎం సంస్థ మొబైల్ నంబర్లు 8332013999, 8332016999, 8332052299లో ఒకదానికి వాట్సాప్ చేయాలని జీటీఎం సంస్థ ఎండీ చీటీ సతీశ్‌రావు 'సాక్షి'కి తెలిపారు. ఉచిత నియామకాల ప్రక్రియను వలస కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ నయాపైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఓయూ మాజీ వీసీ నవనీతరావు కన్నుమూత



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాజీ వీసీ ప్రొ.నవనీతరావు (95) శుక్రవారం రాత్రి బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన ఆయన ఓయూ కెమిస్ట్రీ విభాగంలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేసి 1970లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. బోధన, పరిశోధనలో ప్రతిభను చాటుతూ 220 పరిశోధన వ్యాసాలను, 5 పుస్తకాలు రాశారు. ఆయన పర్యవేక్షణలో 24 మంది పరిశోధన విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని 160 పరిశోధన వ్యాసాలను సమర్పించారు. ఓయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులుగా వివిధ పాలన పదవులు చేపట్టిన ప్రొ.నవనీతరావు.. యంగ్ సైంటిస్ట్ అవార్డులతో పాటు ఇతర అనేక అవార్డులను అందుకున్నారు.

ఢిల్లీ తరువాత మనమే..

- 'అద్దె ఇళ్ల డిమాండ్'లో షహర్ హైదరాబాద్‌కు రెండోస్థానం
- డబుల్ బెడ్రూంవైపే అత్యధికుల మొగ్గు
- 'మ్యాజిక్ బ్రిక్స్' అధ్యయనంలో వివిధ అంశాలు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో అద్దె ఇళ్ల మార్కెట్ (రెంటల్ మార్కెట్) అంతకంతకూ వృద్ధి చెందుతోంది. సింగిల్, డబుల్ బెడ్‌రూం అద్దె ఇళ్లకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అద్దె ఇళ్ల కోసం వెతుకుతున్న వారిలో అత్యధికశాతం (80 శాతం) మంది సౌకర్యవంతమైన చిన్న అపార్ట్‌మెంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అద్దె ఇళ్ల డిమాండ్‌లో దేశరాజధాని ఢిల్లీ 27.25 శాతంతో ప్రథమ స్థానంలో, హైదరాబాద్ నగరం 22 శాతంతో ద్వితీయ స్థానంలో నిలుస్తోంది. పుణే (19.3 శాతం), ముంబై (18.35 శాతం), బెంగళూరు (12.8 శాతం) తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. గతంతో పోల్చితే గత మూడునెలల్లో (ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో) రెంటల్ డిమాండ్ 18.1 శాతం పెరగగా, అదే సమయంలో రెంటల్ సప్లయ్‌లు కూడా 9.6 శాతం, అద్దెలు 4.9 శాతం పెరిగాయి. ఆ మూడునెలల కాలంలో సగటు అద్దెల పెరుగుదలలో బెంగళూరు (8.1 శాతం). నవీ ముంబై (7.3 శాతం), గురుగ్రామ్ (5.1 శాతం) ముందువరసలో నిలుస్తున్నాయి. అదేసమయంలో కొన్ని నగరాల్లో అద్దెల్లో స్వల్ప శాతం పెరుగుదల నమోదైంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'మ్యాజిక్ బ్రిక్స్' గత ఏప్రిల్–జూన్ నెలలకు సంబంధించి దేశంలోని 13 ప్రధాన నగరాల్లో అద్దె ఇళ్లకున్న డిమాండ్‌ను పరిశీలించి విడుదల చేసిన రెంటల్ ఇండెక్స్‌లో అనేక ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి.

'డబుల్'కు లేదు సాటి...

మరీ విలాసవంతంగా కాకపోయినా ఉన్నంతలో సౌకర్యవంతంగా ఉండేలా డబుల్ బెడ్‌రూం ఇళ్లను అద్దెకోసం అత్యధికులు కోరుకుంటున్నారు. అద్దె ఇళ్ల డిమాండ్, సప్లయ్ శాతంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 57 శాతం, వన్ బీహెచ్‌కే ఇళ్లకు 27 శాతం, ట్రిపుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం 18 శాతం డిమాండ్ ఉన్నట్టుగా ఈ నివేదిక ద్వారా తెలుస్తోంది. అంతకు ముందు నెలలతో (జనవరి–మార్చి మధ్యలో) పోల్చితే గత ఏప్రిల్–జూన్‌ల మధ్య త్రీ బీహెచ్‌కేల డిమాండ్ 36 శాతం నుంచి 18 శాతానికి (సగానికి) పడిపోయినట్టు తెలిపింది. అదే సింగిల్ బెడ్‌రూంల డిమాండ్ 17 శాతం నుంచి 27 శాతానికి పెరిగింది. సామాన్య, దిగువ, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా అద్దెలు ఉండటమే ఆయా ప్రధాన నగరాల్లో సింగిల్, డబుల్ బెడ్‌రూం ఇళ్ల డిమాండ్ పెరగడానికి ముఖ్య కారణంగా మ్యాజిక్ బ్రిక్స్ అంచనా వేస్తోంది. నెలకు రూ.10 నుంచి 20 వేలలోపు అద్దె ఉన్న ఇళ్లకు కిరాయిదారులు అత్యధికంగా మొగ్గుచూపుతున్నారు. వీరిలో ఎక్కువమంది 500 చదరపు అడుగుల నుంచి వెయ్యి చదరపు అడుగుల కవర్డ్ ఏరియా ఉన్న అద్దె ఇళ్లు తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా హైదరాబాద్ విషయానికొస్తే... (గత ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో)

- హైదరాబాద్‌లో అద్దె ఇళ్ల డిమాండ్ 22 శాతం పెరుగుదల (ఆన్‌లైన్, ఇతరత్రా రూపాల్లో వెతకడం–యాక్టివ్ లిస్టింగ్స్‌లో)
- ఏప్రిల్–జూన్‌ల మధ్య అద్దెలు 4.5 శాతం వృద్ధి
- ఓఆర్‌ఆర్‌కు దగ్గరలో ఉండడంతో పాటు ప్రధాన ఐటీ, ఇతర ఉద్యోగ కేంద్రాలకు సమీపంగా ఉన్న కారణంగా మైక్రో మార్కెట్స్‌లో అద్దె ఇళ్ల కోసం అత్యధికంగా సెర్చ్ చేస్తున్న ప్రాంతాల్లో గచ్చిబౌలి, కొండాపూర్ అగ్రభాగాన నిలుస్తున్నాయి
- నగరంలోని ఆయా ప్రాంతాల్లో రూ.20 వేలు–32 వేలలోపున్న టూ బీహెచ్‌కేల కోసం ఎక్కువ మంది ప్రాధాన్యతనిస్తున్నారు

దేశంలోని ప్రధాననగరాలకు గత ఏడాది కాలంగా ఉద్యోగులు, విద్యార్థులు తిరిగి చేరుకుంటుండడంతో అద్దె ఇళ్లకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ఉద్యోగుల్లో అత్యధిక శాతం ఆఫీసుల నుంచి పనిచేస్తుండటంతో వాటికి దగ్గరగా ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నారు.
– సుధీర్ పాయ్, సీఈవో, మ్యాజిక్ బ్రిక్స్

హైదరాబాద్‌లో అద్దెలిలా...

లోకాలిటీ	2 బీహెచ్‌కే	3 బీహెచ్‌కే
గచ్చిబౌలి	24,000	35,000
కొండాపూర్	21,000	30,000
హైటెక్ సిటీ	32,000	47,000
మాదాపూర్	21,000	30,000
కోకాపేట్	23,000	33,000
నార్సింగి	22,000	32,000
కూకట్‌పల్లి	16,000	23,000
బంజారాహిల్స్	20,000	30,000
నల్లగండ్ల	22,000	32,000
జూబ్లీహిల్స్	23,000	33,000
మణికొండ	17,000	24,000

టెట్‌పై పట్టు ఏదీ?

- పరీక్ష రాసే వారిలో సగం మందికంటే తక్కువే పాస్..
- ఏడేళ్లుగా ఇదే తరహాలో ఫలితాలు
- కనీస అర్హత మార్కులు ఎక్కువ..
- ఇంగ్లిష్‌పై పట్టులేక ఇబ్బంది
- టీచర్ల నియామకాలు లేకపోవడం కూడా కారణమంటున్న అభ్యర్థులు
- సీరియస్‌గా సిద్ధం కాలేకపోతున్నామని ఆవేదన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ శిక్షణ తీసుకుంటున్నా.. ఆ తర్వాత ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో మాత్రం చాలా మంది ఫెయిలవుతున్నారు. బీఎడ్ విద్యార్హతతో రాసే పేపర్–2లో 2011 నుంచి ఇప్పటివరకు ప్రతిసారీ ఉత్తీర్ణత శాతం సగం కూడా దాటలేదు. తెలంగాణ ఏర్పాటయ్యాక ఒక్క 2022లో తప్ప ఎప్పుడూ ఉత్తీర్ణత 30% కూడా దాటకపోవడం గమనార్హం. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ఇస్తామని గతేడాది ప్రకటించడంతో.. ప్రైవేటు బడుల్లో పనిచేస్తున్నవారు సహా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు కోచింగ్ కేంద్రాలకు వెళ్లి మరీ టెట్ కోసం సిద్ధమయ్యారు. అయినా పాస్ శాతం తక్కువే నమోదైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక నోటిఫికేషన్‌తోపాటు టెట్ నోటిఫికేషన్ ఇచ్చేవారని.. టీచర్ పోస్టుల భర్తీపై నమ్మకం ఉండేదని అభ్యర్థులు చెప్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక 2017లో మినహా ఇంతవరకు టీచర్ పోస్టుల భర్తీ జరగలేదు. దీంతో టెట్‌పై అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని, సీరియస్‌గా ప్రిపేర్ కాకుండానే పరీక్షలు రాస్తున్నారని నిపుణులు అంటున్నారు.

అందని అర్హత గీటురాయి: టెట్ ప్రశ్నపత్రం 150 మార్కులకు ఉంటుంది. ఇందులో అర్హత పొందాలంటే ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 90 మార్కులు, బీసీలు 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 60 మార్కులు సాధించాలి. పేపర్–1 (డీఎడ్ అర్హతతో రాసేది)తో పోలిస్తే, పేపర్–2 (బీఎడ్ అర్హతతో రాసేది) కష్టంగా ఉంటోందని పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు చెప్తున్నారు. మేథ్స్, ఇంగ్లిష్ పై పట్టు ఉంటే తప్ప కనీసం 90 మార్కులు సాధించడం కష్టమేనని.. ముఖ్యంగా మేథ్స్‌లో సరైన సమాధానం రాబట్టేందుకు ఎక్కువ సమయం పడుతోందని అంటున్నారు. కనీసం 6 నెలల పాటు మోడల్ ప్రశ్నలు చేసి ఉంటేనే ఇది సాధ్యమవుతుందని వివరిస్తున్నారు. ఇక ఇంగ్లిష్‌లో ప్రధానంగా జాతీయాలు, మోడ్రన్, అడ్వాన్స్‌డ్ లాంగ్వేజ్ నుంచి ప్రశ్నలు ఇస్తున్నారని.. వీటికి తగ్గ ప్రిపరేషన్ ఉండటం లేదని స్పష్టం చేస్తున్నారు. అదే పేపర్–1 ఇంటర్మీడియట్ స్థాయిలో ఉంటోందని.. బోధన మెళకువలు, మోడ్రన్ టీచింగ్ మెథడ్స్‌పై దృష్టి పెడితే తేలికగా గట్టెక్కగలుగుతున్నారని నిపుణులు అంటున్నారు.

నాలుగున్నర లక్షల మందిలో..

రాష్ట్రంలో 1.5 లక్షల మంది డీఎడ్ ఉత్తీర్ణులు, 4.5 లక్షల మంది బీఎడ్ ఉత్తీర్ణులు కలిపి ఆరు లక్షల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నారు. వీరిలో సుమారు 4 లక్షల మంది మాత్రమే ఇప్పటివరకు టెట్ ఉత్తీర్ణత సాధించగలిగారు. టెట్‌లో పేపర్–1 పాసైతే.. 1–5 వరకూ బోధించే 'సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)' పోస్టులకు.. పేపర్–2 పాసైతే పదో తరగతి వరకు బోధించే 'స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ)' పోస్టులకు పోటీపడే వీలు ఉంటుంది. డీఎడ్ పూర్తిచేసినవారు పేపర్–1 మాత్రమే రాసే వీలుండగా.. బీఎడ్ వారు పేపర్–1, పేపర్–2 రెండూ రాయవచ్చు. అయితే పేపర్–1 కాస్త సులువుగా ఉంటుండటంతో.. చాలా మంది బీఎడ్ వారు పేపర్–1పైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని, ఇదికూడా పేపర్–2లో అర్హత శాతం తగ్గడానికి కారణమవుతోందని నిపుణులు చెప్తున్నారు.

ఇంగ్లిష్, మేథ్స్‌కు కష్టపడాలి

కేవలం 45 రోజుల్లోనే టెట్‌కు ప్రిపేర్ అవ్వాలంటే చాలా కష్టపడాలి. ఇంగ్లిష్, మేథ్స్‌లో మంచి మార్కులు సాధిస్తేనే అర్హత సాధించవచ్చు. దీనికి ప్రత్యేక సన్నద్ధత అవసరం. టీచర్ పోస్టులు వస్తాయనే ఆశతో కోచింగ్ కేంద్రాలకు వెళ్లి శిక్షణ తీసుకుంటున్నాం. కానీ టీచర్ నోటిఫికేషన్ రాకపోవడం నిరాశగా ఉంది.
– స్వాతి, టెట్ అభ్యర్థి, భూపాలపల్లి

నియామకాలుంటేనే ఉత్సాహం

టెట్ ఉత్తీర్ణులు లక్షల్లో ఉన్నారు. టీచర్ పోస్టులు వస్తాయని ఆశతో ఉన్నాం. కానీ ఏటా నిరాశే ఎదురవుతోంది. నియామక నోటిఫికేషన్ వస్తేనే మాకూ ఉత్సాహంగా ఉంటుంది. ఈసారైనా రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తారని ఆశిస్తున్నాం.
– ఇమ్రాన్ పాషా, టెట్ అభ్యర్థి, ములుగు జిల్లా

2011 నుంచి టెట్ ఉత్తీర్ణత శాతం

ఏడాది	పేపర్–1	పేపర్–2
2011	44.27	49.68
2012	44.53	47.02
2014	61.86	28.56
2016	54.45	25.04
2017	57.37	19.51
2022	32.68	49.64

కొడుకును బావిలో పడేసి.. ఆపై పురుగు మందు తాగి..

- బాలుడి మృతి.. చికిత్స పొందుతున్న తండ్రి
- కుటుంబంలో ఆస్తి గొడవలే కారణమా?



దేవాన్ష్ (ఫైల్)



చికిత్స పొందుతున్న తిరుపతిరెడ్డి

ఎలిగేడు: కుటుంబంలో ఆస్తి గొడవలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి కొడుకు(17 నెలలు)ను బావిలో పడేసి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో బాలుడు మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం రాములపల్లికి చెందిన కల్వల తిరుపతిరెడ్డి, మానస దంపతులు. వీరికి దేవాన్ష్ (17 నెలలు) సంతానం. తిరుపతిరెడ్డి, అతడి సోదరుడు రత్నాకర్‌రెడ్డి మధ్య కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. మూడునెలల క్రితం పంచాయితీ పెట్టి పెద్దల సమక్షంలో ఆస్తి పంచుకున్నారు. అప్పటి నుంచి తిరుపతిరెడ్డి భార్య, కుమారుడితో కలిసి సుల్తానాబాద్‌లోని ఓ అద్దింట్లో నివాసం ఉంటున్నాడు. ఆస్తి పంపకాల విషయమై చంపుతామని తరచూ కొందరు బెదిరిస్తున్నారని భార్యతో చెప్పుకుని తిరుపతిరెడ్డి బాధపడేవాడు. ఈ క్రమంలో రాములపల్లిలో ఉంటున్న తల్లిదండ్రులకు తన కుమారుడిని చూపించి తీసుకొస్తానని భార్యతో చెప్పి బయల్దేరాడు. అయితే ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్తకు మానస ఫోన్ చేయగా సమాధానం రాలేదు. వెంటనే అత్తామామలకు ఫోన్ చేయగా రాములపల్లికి రాలేదని వారు చెప్పారు. అనుమానంతో పొలం వద్దకు వెళ్లి చూడగా తిరుపతిరెడ్డి అపస్మారకస్థితిలో కనిపించాడు. బావిలో బాలుడి చెప్పులు కన్పించాయి. తిరుపతిరెడ్డిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. కాస్త తేరుకున్నాక దేవాన్ష్ గురించి అడుగగా తానే బావిలో పడేసి గడ్డిమందు తాగానని చెప్పాడు. విషయం తెలుసుకున్న సుల్తానాబాద్ సీఐ జగదీశ్, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ బావి వద్దకు చేరుకుని గ్రామస్తుల సహకారంతో దేవాన్ష్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



పాలమూరు: రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు సైనికుల మాదిరిగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని కర్ణాటక ఎమ్మెల్యే దొడ్డన్నగౌడ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని నిర్వహించిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సైన్యంలో మనమంతా సైనికుల మాదిరిగా పని చేసి తెలంగాణలో విజయఢంకా మోగించాలన్నారు. దేశ అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి యావత్ భారత్ మొత్తం మోదీని అనుసరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ పాలకపక్షం అనేక జిమ్మిక్కులు చేస్తోందని, వారి మాయలో కార్యకర్తలు పడరాదన్నారు. బీజేపీ కార్యకర్తలకు కెప్టెన్ మోదీ ఉన్నాడని, ఎవరూ కూడా ఆధైర్యపడవద్దన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికార బలంతో పాటు మద్యంపై ఎన్నికలకు వెళ్తుందన్నారు. 9 ఏళ్ల కాలంలో మద్యంపై ప్రభుత్వానికి రూ.42వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. మద్యం వ్యాపారం చేసేందుకు పక్క రాష్ట్రాల నుంచి కార్పొరేట్ సంస్థలు సైతం వచ్చి టెండర్లు వేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. రాష్ట్రంలో ఈ ప్రభుత్వాన్ని గద్దె దించితే తప్ప ఇక్కడి పరిస్థితులు మారవన్నారు. తెలంగాణలో బీజేపీని గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ కార్యకర్తలు అధికార పార్టీ ఎత్తుగడలను తట్టుకొని, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.చంద్రశేఖర్, రాష్ట్రకార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, నారాయణ యాదవ్, పాండురంగారెడ్డి, అంజయ్య, చిన్న వీరయ్య, కొండయ్య, రామాంజనేయులు, జయశ్రీ, ఎడ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

కందనూలు: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని పెద్దముద్దునూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ కథనం మేరకు.. గ్రామంలోని ఓ పాఠశాలలో చదువుతున్న మనువరాలు, మనవడికి వృద్ధురాలు అనసూయమ్మ మధ్యాహ్న భోజనం తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

డీజిల్ అక్రమ దందా

- కర్ణాటక నుంచి తీసుకొస్తుండగా జడ్చర్ల సమీపంలో ట్యాంకర్ పట్టివేత
- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణ ప్రారంభించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



పట్టుబడిన డీజిల్ ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

జడ్చర్ల: కర్ణాటకలో డీజిల్ ధర తక్కువగా ఉండటంతో దొడ్డిదారిన రాష్ట్రానికి తీసుకొచ్చి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ఉదంతానికి ఊతమిచ్చేలా శనివారం జడ్చర్ల సమీపంలో ఓ డీజిల్ ట్యాంకర్ కనిపించింది. పోలీసులు రంగంలోకి దిగి ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకొని విచారణ ప్రారంభించారు. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. జడ్చర్ల మండలం గంగాపూర్ సమీపంలో 167వ నంబర్ జాతీయ రహదారిపై డీజిల్ ట్యాంకర్ కనిపించడంతో పట్టుకొని పత్రాలు పరిశీలించగా దేవరకద్రలోని కురుమూర్తి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి మూడు విడతలుగా డీజిల్ కొనుగోలు చేసినట్లు చేతి రాత బిల్లులు కనిపించాయి. కంప్యూటర్ బిల్లుల స్థానంలో చేతి రాత బిల్లులు ఉండటం పలు అనుమానాలకు తావిచ్చాయి. అంతేగాక దేవరకద్ర నుంచి నల్గొండ జిల్లా డిండి ప్రాంతానికి డీజిల్ తీసుకెళ్తున్నట్లు ట్యాంకర్ డ్రైవర్ నరేందర్‌గౌడ్ చెబుతున్నారు. డిండితో పాటు సమీప ప్రాంతాల్లో అనేక పెట్రోల్ బంకులు ఉండగా.. దేవరకద్రలో డీజిల్ కొనుగోలు చేసి డిండికి తరలించడం వెనుక మతలబు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డీజిల్ ట్యాంకర్‌ను జడ్చర్ల డీటీసీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ..

పట్టుబడిన డీజిల్ ట్యాంకర్‌ను జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు బాలప్రసాద్, స్వప్న పరిశీలించి జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో వివరాలు సేకరించారు. పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

పట్టించుకోని వాణిజ్య పన్నులశాఖ..

ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి అక్రమంగా కర్ణాటక నుంచి డీజిల్ తరలిస్తున్నా జిల్లా వాణిజ్య పన్నులశాఖ అధికారులు పెద్దగా దృష్టి సారించినట్లు లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ డీజిల్ ట్యాంకర్‌ను మహబూబ్‌నగర్‌లో పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు కలెక్టర్ సుమారు రూ.5 లక్షల వరకు జరిమానా విధించినట్లు తెలిసింది. రాష్ట్రానికి రావాల్సిన వ్యాట్‌ను ఎగ్గొట్టి అక్రమంగా కర్ణాటక నుంచి డీజిల్ తరలించి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కర్ణాటక ఇంధనమేనా?

కర్ణాటకలో ఇంధన ధర తెలంగాణా కంటే లీటర్‌పై సుమారు రూ.10 వరకు తక్కువగా ఉంది. ఈ నెల 25న కర్ణాటకలో లీటరు డీజిల్ ధర రూ.88.42 ఉండగా.. హైదరాబాద్‌లో రూ.97.82 ఉంది. అక్కడ కొనుగోలు చేసిన డీజిల్‌ను ఇక్కడి పెట్రోల్ బంకులతో పాటు ప్రాజెక్టులు తదితర కాంట్రాక్టు పనులు చేసే వారికి కొంత తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ట్యాంకర్‌పై కనీసం రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుండటంతో అక్రమార్కులు డీజిల్ వ్యాపారంపై దృష్టి సారించినట్లు సమాచారం. కర్ణాటక సరిహద్దు ఉమ్మడి జిల్లాకు దగ్గరగా ఉండటంతో గుట్టుగా అక్రమ వ్యాపారానికి తెరలేపినట్లు తెలుస్తోంది.

విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న 93 జేఎల్‌ఎం ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 28న 100 మంది అభ్యర్థులకు, 29న 82 మంది అభ్యర్థులకు స్థానిక సహాయ డివిజినల్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో ఇంటర్వ్యూ, పోల్ క్లైంబింగ్ పరీక్షలు నిర్వహిస్తామని డీఈ చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థుల ఎంపిక కమిటీ చైర్మన్ బాలస్వామి(సీజీఎం), కన్వీనర్ కె.ప్రభాకర్‌తో పాటు సభ్యుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు ఉంటాయని, అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో పదో తరగతి ఉత్తీర్ణత పొందిన మెమో, ఐటీఐ, కుల ధ్రువీకరణ పత్రం, స్థానిక ధ్రువపత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్స్ ఒకటో తరగతి నుంచి 7వ తనగతి వరకు, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ 2020–21 తర్వాత జారీ చేయబడిన బీసీ అభ్యర్థులు, ఈడబ్ల్యూఎస్, ఒరిజినల్ హాల్‌టికెట్, రెండు ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. సరైన సర్టిఫికెట్స్ లేని వారు, గైర్హాజరైన అభ్యర్థులను పరిగణలోకి తీసుకోమని పేర్కొన్నారు. ఎవరైనా దళారులు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దని, పోల్ క్లైంబింగ్ ఎక్కిన అభ్యర్థులకు మెరిట్, రోస్టర్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని వివరించారు.





వైభవంగా పట్టాభిషేకం

మున్సిపాలిటీలో జరుగుతున్న విశ్వశాంతి యాగ మహోత్సవంలో శనివారం సీతారామచంద్ర పట్టాభిషేక మహోత్సవం కృష్ణజ్యోతి స్వరూపానంద ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పాదుకాపట్టాభిషేకము, శ్రీకృష్ణ కాలచక్ర యంత్ర లక్ష దీపోత్సవం, శ్రీ సుదర్శన పూర్వక మహామృత్యుంజ, వరలక్ష్మీ సమేత మహానారాయణ హోమాలు చేపట్టారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరైన వస్త్రాలు సమర్పించారు. యాగ మహోత్సవం ఆదివారం ముగియనుంది.
– జడ్చర్ల టౌన్

పర్యావరణ పరిరక్షణకు కృషి



జడ్చర్ల డీటీసీలో మొక్క నాటి నీరుపోస్తున్న డీఐజీ చౌహాన్.. చిత్రంలో ఎస్పీ నరసింహ తదితరులు

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

జడ్చర్ల/మహబూబ్‌నగర్ క్రైం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ కోరారు. శనివారం జడ్చర్ల డీటీసీలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం మొక్కలను సంరక్షించాలని, అడవులను కాపాడితే సకాలంలో వర్షాలు కురుస్తాయని వివరించారు. పచ్చదనం, వృక్షసంపద లేకపోతే ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయన్నారు. జిల్లాలోని ఒక్కో స్టేషన్ ఆవరణలో 20 నుంచి 100 మొక్కలు నాటారని.. శనివారం మొత్తంగా 1,890 మొక్కలు నాటినట్లు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీలు మహేశ్, రమణారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

42 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో టీచర్ పోస్టుల డీఎస్సీ ప్రకటన నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పలువురు నిరుద్యోగులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022, మార్చి 13న సీఎం కేసీఆర్ అసెంబ్లీలో 13,086 టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారని, కానీ ఇప్పుడు 5,089 పోస్టులను మాత్రమే భర్తీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో 4 లక్షల మంది నిరుద్యోగ యువత టెట్ అర్హత సాధించి టీచర్ పోస్టుల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో కేవలం 586 పోస్టుల్లో ఐదుశాతం నాన్‌లోకల్‌కు పోగా మిగతా 550 పోస్టులు ఉన్నాయని, కానీ 80 వేల మంది అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఒక్క పోస్టుకు 1,600 మంది పోటీపడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ పోస్టులు ప్రకటిస్తే నిరుద్యోగులకు ఏ విధమైన న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైమరీ స్కూళ్లలో ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండాలని, అందువల్ల రాష్ట్రంలో 42 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కల దృష్టికి తీసుకెళ్లి టీచర్ పోస్టుల భర్తీ కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ మాట్లాడుతూ ఉర్దూ మీడియం పోస్టుల భర్తీని కూడా పూర్తిస్థాయిలో నియామకం చేయడం లేదన్నారు. మూడు నెలలు ఆగితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు



బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం శనివారం సందర్భంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజాచార్యులు అన్నారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.